17

# తరం మారింది

నాకు పదో ఏట పెళ్ళయింది. వెండి కంచం, చెంబు వెయ్యిన్నూట పదహార్లు కట్నంగా ఇచ్చారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూడగా చూడగా నీకేమో లక్షరూపాయలు కట్న మిచ్చుకుంటే కానీ మెడలో మూడు ముళ్ళు పడ లేదు. ఇప్పుడైనా లక్షణంగా మొగుడూ పెళ్ళాం కలిసి కాపురం పెట్టకుండా ఉద్యోగం అంటూ అతనో చోట, నువ్వొక చోట వుండటమేంటే తల్లీ? నా మాట విని ఆ బోడి ఉద్యోగం వదిలేసి, హాయిగా అతనితో బెంగుళూరు వెళ్ళిపో.

"అబ్బా! అమ్మమ్మా! అణా పెట్టి మల్లెపూలు కొనుక్కోవాలంటే మొగుణ్ణి దేబిరించాల్సి వచ్చేదని నువ్వే చెప్పావు. రూపాయి పెట్టి నీకు రవిక బట్ట కొంటే రూపాయి పావలా పెట్టి ఉంపుడు గత్తెకు కొనుక్కు వెళ్ళేవాడు తాతయ్య అనీ చెప్పావు. ఎవరూ చూడకుండా ఏడ్చేదాన్నని చెప్పావు. ఆ తరం మారిపోయిందే అమ్మమ్మా. ఈ కాలం ఆడవాళ్ళు ఆత్మ గౌరవం కోసం ప్రాణాలిస్తారుతెల్సా? ఇంత చదువుకుని, ఉద్యోగం చేతిలో వుండగా, అన్నీ వదిలేసి నీలాగే మొగుడిమీద ఆధారపడి బ్రతకడం నావల్లకాదు" తెగేసి చెప్పింది మాలతి.

కూతురు పోయాక ఆ పిల్లను తానే తల్లియై పెంచిన ఆశ చావక కొత్త పెళ్ళి కొడుకుని కదిపి చూసింది: "అదేదో తెలీక ఉద్యోగం అంటూ ఉబలాటపడుతోంది. నువ్వైనా గట్టిగా చెప్పి రాజీనామా చేయించి తీసుకెళ్ళరాదూ నాయనా?" అని.

'బామ్మగారూ! ఈ కాలం ఆడపిల్లలకు స్వతంత్రం కావాలి. తాళి కట్టాను కదా అని అధికారం ఛలాయిస్తే పోపొమ్మని తరిమేస్తుంది మీ మనవరాలు' భార్యవైపు చూసి నవ్వాడు మాధవరావు. మాలతి కళ్ళు మెరిసాయి.

మళ్ళీ అతనే ఇలా అన్నాడు 'బెంగుళూరులో ఇంటి అద్దె భరించడమంటే మాటలు కాదు బామ్మగారు. నేనంటే ఇంకో ముగ్గురు స్నేహితులతో కలిసి ఒక గదిలోవున్నాను. సంసారం పెట్టాలంటే నా జీతంలో నాలుగువేలు ఇంటి అద్దెకే పోతుంది. ఇంకేం తింటాం చెప్పండి? మీరిచ్చిన కట్నం డబ్బు నాకోసం అనుకున్నారా? దానితో చిన్న స్థలం కొంటాను. లోను తీసుకుని ఇల్లు కట్టుకుంటే నాలుగేళ్ళలో అప్పు తీర్చేయవచ్చు. ఆ తరువాత మాలతి ఉద్యోగం చేస్తానన్నా నేను ఒప్పుకోనులెండి'..

ఇంటి స్థలం తనపేరిట వుంటే కానీ లోన్ శాంక్షన్ కాదని మాధవరావు బాధ పడితే 'మీ పేరు మీద వుంటే ఒకటి నాపేరు మీద వుంటే ఒకటీనా? మనిద్దరం ఒకటి కాదా?' అని ఓదార్చింది మాలతి.

నెలనెలా తన జీతంలో మూడువంతులు భర్తకే పంపిస్తూ వచ్చింది మాలతి. ఒక కొత్త నగ మీద మోజుపడినా, కనీసం పట్టు చీరైనా కొనుక్కోలేకపోయినా బాధ పడలేదు. ఇంటి కోసం చేసిన అప్పు తీరితే ఎన్నైనా కొనుక్కోవచ్చు అంటూ మనసును సమాధానం చెప్పుకుంది.

రెండు కేలండర్ల తరువాత ఇల్లు పూర్తయింది. లీజుకిచ్చి అప్పు తీర్చడానికి మరో రెండు పుట్టిన రోజులు గడిచాయి.

"ఇక శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేసుకొని మా ఇంట్లోకి మారిపోతాం. ముందు పదిరోజులు సెలవు పెట్టి వెళ్ళి తర్వాత నింపాదిగా రాజీనామా చేసేస్తాను. అక్కడే ఏదో ఒక ఉద్యోగం చూసుకుంటా." అంటూ కొలీగ్స్‌కు చెప్తూ వచ్చింది మాలతి.

రేపు గృహప్రవేశమనగా ముందు రోజు వచ్చిచేరింది మాధవరావు రాసిన ఉత్తరం. వారం రోజుల క్రిందటి తారీఖు వుంది దాని మీద. 'పోస్టల్ డిలే' అని చిరాకు పడింది మాలతి. హడావుడిగా రాత్రికి రాత్రి ప్రయాణమయింది. 'తనునెల తప్పిందని తెలిస్తే పొంగిపోతాడు భర్త' అని అనుకుంటూ! బెంగుళూరు చేరేసరికి ఉదయం పదిగంటయింది. నేను రాలేదని ముహూర్తం పోస్ట్‌పోన్ చేసుకున్నారేమో అనుకుంటూ ఆటో ఎక్కింది.

క్రొత్తగా పెయింట్స్ వేసి, మామిడి తోరణాలతో కలకల లాడుతున్న ఇంటి ముందు బండి దిగుతుంటే మాలతి గుండె గర్వంగా కొట్టుకుంది 'స్వార్జితంతో కట్టుకున్న తమ ఇల్లు' అనుకుంటుంటే.

మాలతి లోపలికి వస్తుండగా జంటలు జంటలుగా బయటకు వస్తూ కనబడ్డారు మనుష్యులు.

లోపలికి వెళ్ళేసరికి మరో అమ్మాయి భుజం చుట్టూ చేయి వేసి 'జాగ్రత్త సరితా.. నెమ్మదిగా పద ప్రొద్దుటి నుండి బాగా అలిసిపోయావు కదూ? నిన్ను కష్టపెట్టానని కడుపులో బాబు మనల్ని తిట్టుకుంటున్నాడేమో' అంటున్న మాధవరావును చూసి కర్రాటలా నిలబడిపోయింది.

నిముషం తరువాత తేరుకొని గిర్రున వెను దిరిగిన మాలతిని ఆపేసాడు మాధవరావు.

చూడు మాలతీ మన పెళ్ళయ్యాక నువ్వు వచ్చిపోవడానికి వీలుగా వుండాలనే కదా వీళ్ళింట్లో గది అద్దెకు తీసుకున్నాను. పెళ్ళయి బ్రహ్మచర్యం నడుపుతున్నవాడిని కదా! పరిస్థితుల ప్రభావం మా ఇద్దర్ని కలిపింది. అల్లరి పడితే మనకే నష్టం. నాకేం మగవాడిని. ఎవరేమన్నా దులుపుకు పోగలను. కానీ నీ గురించే ఆలోచించాను. ఒంటరిగా వుండి ఉద్యోగం చేస్తున్నదానివి. ఈ గొడవ అక్కడదాకా వస్తే నీ పరువేం కావాలి? అందుకే విధిలేక సరితను పెళ్లి చేసుకున్నాను. రెండోభార్య గనుక తన రక్షణ కోసం పెళ్ళికి ముందే ఈ ఇల్లు తన పేర రిజిస్టరు చేయించాలంది సరిత

అలాగే అనక తప్పలేదు. అలాగని నేను నీకు అన్యాయం చేస్తాననుకోకు. నువ్వు నా పట్టమహిషివి.నేను మామూలుగానే వచ్చి పోతుంటాను. ప్లీజ్ అర్ధం చేసుకో. గొడవ చేసి అల్లరి పడకు అన్నాడు మాధవరావు.

ఎనిమిది రోజులు సెలవు కాన్సిల్ చేసుకొని డ్యూటీలో చేరింది మాలతి.తోటి ఉద్యోగులు ఊహాగానాలు మొదలు పెట్టారు.మూడు నెలలు గడిచినా మాధవరావు రాలేదు.ఆఫీసులో అందరూ అనుమానంగా అడుగుతుండటంతో అభిమానం చంపుకొని మాధవరావుకో ఉత్తరం రాసింది.కడుపులో కదిలే బిడ్డకు తండ్రి కావాలి కదా!

"సారీ మాలతీ! సరిత మందులకు, ఇంటి ఖర్చులకు బొటా బొటిగా సరిపోతుంది నా జీతం. అంత దూరం వచ్చిపోవాలంటే డబ్బు కావాలి కదా. అందుకే రాలేకపోయాను" అని రాసాడు మాధవరావు.

తిరుగు టపాలో మాలతి పంపిన వెయ్యిరూపాయలు అందగానే బయల్దేరి వచ్చాడు. మర్నాడు భర్తను వెంట బెట్టుకుని ఆఫీసుకు వెళ్ళింది మాలతి అందరి నోళ్ళు మూయించడానికి అన్నట్లు.

"నెలనెలా నీ నుండి డబ్బు రావడమే తడవుగా నేను వచ్చేస్తాను డియర్. నీ ఆరోగ్యం జాగ్రత్త" వెళ్తూ చెప్పాడు అతను.

ఆ సాయంకాలం తన ఇంటికి వచ్చిన తోటి ఉద్యోగినులకు తన మెడలోని కొత్త బంగారు గొలుసును చూపిస్తూ "మా ఆయన నా బర్త్‌డే కని ముందే గిఫ్ట్ తెచ్చారు" అంటున్న మాలతిని చూసి బుగ్గలునొక్కుకుంది అమ్మమ్మ.

ముసలాయన వదిలిపోయిన భూమి మీద వచ్చిన అయివేజులతో మాలతికి ఆ గొలుసును చేయించింది ఆవిడ.

వచ్చినవాళ్ళు వెళ్ళిపోయాక అమ్మమ్మతో అంది మాలతి "మీ తరం ఆడవాళ్ళకు స్వాతంత్ర్యం లేకపోయినా కట్టుకున్నవాడు కడదాక చూస్తాడన్న నమ్మకం, ధీమా వుండేది అమ్మమ్మా. ఏ కొంపలు తిరిగినా భార్యస్థానం పదిలంగా వుండేది.కానీ తరంమారిందనీ, మాకు అలాంటి బానిసత్వం వద్దనీ ఆర్థిక స్వాతంత్ర్యం మాకు స్వేచ్ఛనిస్తుందనీ పోరాడి ఈ స్వాతంత్ర్యం సంపాదించుకున్నాం". రెప్పలు దాటని కన్నీళ్ళతో మాలతి కళ్ళు ఎరుపు రంగులో మెరిసాయి.